క్లుప్తంగా

కలెక్టర్‌తో పలువురు భేటీ



కలెక్టర్‌కు మొక్క అందిస్తున్న నాగమల్లేశ్వర్‌రెడ్డి

తిరుపతి అర్బన్: జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన నాగమల్లేశ్వర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా సోమవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిశారు. అలాగే తిరుపతి, చిత్తూరు జిల్లాల ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్, తిరుపతి జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారి బాలాజీ నాయక్, సూళ్లూరుపేట ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన కిరణ్మయి కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

నలుగురు పోలీసుల ఉద్యోగ విరమణ



పదవీ విరమణ పొందిన వారితో జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైమ్: జిల్లాలో సుదీర్ఘ కాలంగా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన పోలీసులను జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఘనంగా సత్కరించారు. సోమవారం పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన ఏఎస్‌ఐలు టి.జనార్దన నాయుడు, ఎండీ జీవరత్నం, సి.గోపాల్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ ఎస్.వి.శంకర ప్రసాద్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అంటేనే క్రమశిక్షణకు మారుపేరు అని, అలాంటి ఈ శాఖలో సుదీర్ఘకాలం బాధ్యతాయుతంగా సేవలు అందించి ఈ రోజు ఉద్యోగ విరమణ పొందడం అభినందనీయం అన్నారు. కార్యక్రమానికి వెల్ఫేర్ ఆర్ఐ రమణారెడ్డి, పదవీ విరమణ చేసిన వారి కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

వీడ్కోలు



ఎంపీడీఓ, ఏఓలను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

పాకాల : ఉద్యోగ విరమణ పొందిన ఎంపీడీఓ పీఎంఆర్ ప్రభాకర్, సూపరింటెండెంట్ సి.కరుణాకర్‌రెడ్డిని కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగ విరమణ పొందిన వారి శేష జీవితం సంతోషంగా సాగాలని ఆకాంక్షించారు. అనంతరం పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ నంగా పద్మజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్ సేవలు మరువలేనివి




చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న న్యాయమూర్తులు

తిరుపతి లీగల్ : తిరుపతి ప్రిన్సిపల్, అడిషనల్ సీనియర్ సివిల్‌జడ్జి కోర్టుల సూపరింటెండెంట్‌గా మజ్జిగ చంద్రశేఖర్ అందించిన సేవలు మరువలేనివని న్యాయమూర్తులు తెలిపారు. సోమవారం సూపరింటెండెంట్ చంద్రశేఖర్ ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా రెండు సీనియర్ సివిల్ జడ్జి కోర్టుల సిబ్బంది, న్యాయమూర్తుల ఆధ్వర్యంలో చంద్రశేఖర్ దంపతులను శాలువతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

కిట్ల పంపిణీ

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ కళాశాల ఎన్ఎస్ఎస్‌లో వలంటీర్లుగా వ్యవహరిస్తున్న విద్యార్థులకు సోమవారం అధికారులు స్వచ్ఛత పరిరక్షణ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతిరామయ్య మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా వలంటీర్లకు ప్రచార సామగ్రిని అందించామన్నారు. కార్యక్రమంలో ఓఎస్ఏ వేణు, ఎన్ఎస్ఎస్ అధికారులు శ్రీనివాసరావు, అమరావతి, వెంకటేశ్వర్లు, రాజా పాల్గొన్నారు.

నిరంతర సాధనతోనే లక్ష్య సాధన



అవగాహన కల్పిస్తున్న శ్రీధర్

తిరుపతి ఎడ్యుకేషన్ : విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని నిరంతరం సాధన చేస్తే లక్ష్యాన్ని సులువగా సాధించవచ్చని కౌటిల్య ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ శ్రీధర్ తెలిపారు. తిరుపతిలోని కొండారెడ్డి రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్‌ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ (రిమ్స్) కళాశాలలో ఎంప్లాయిబిలిటీ స్కిల్స్‌పై నూతనంగా చేరిన ఎంసీఏ, ఎంబీఏ, ఎమ్మెస్సీ (కంప్యూటర్స్)లో చేరిన విద్యార్థులకు పది రోజుల వర్క్‌షాపు ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.ప్రకాష్‌రెడ్డి, శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రకాల నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. రిమ్స్ కళాశాల అధినేతలు విభాగాధిపతులు, అధ్యాపకులు, పాల్గొన్నారు.

ఉద్యోగాల క్రమబద్ధీకరణకు దేశవ్యాప్త ఉద్యమం



నగరంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

తిరుపతి కల్చరల్: ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, తాత్కాలిక ఉద్యోగుల సర్వీసులు క్రమబద్ధీకరణకు దేశ వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి స్పష్టం చేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం టీటీడీ పరిపాలన భవన్ సమీపం నుంచి వందలాది మంది ఉద్యోగులు, కార్మికులతో పాత మున్సిపల్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ విభాగాల్లో చాలీ చాలని వేతనాలతో నిరంతరం శ్రమిస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా, వారికి ఉద్యోగ భద్రతను కల్పించకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నేతలు బాలసుబ్రమణ్యం, టి.సుబ్రమణ్యం, జయచంద్ర, ఆప్కా రాష్ట్ర అధ్యక్షుడు చినబాబు, వేణుగోపాల్, ఎలక్ట్రికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ నేత కుమార్, బుజ్జి, వివిధ సంఘాల నేతలు వరలక్ష్మి, సుబ్బరత్నమ్మ, మునిలక్ష్మి, అనురాధ, నాగరాజు, రఘు, పురుషోత్తం సిద్దయ్య, రుయా ప్రభాకర్, నరసింహులు సుభాష్ పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ కార్డులను సద్వినియోగం చేసుకోండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: ఆయుష్మాన్ భారత్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయుష్మాన్ భారత్, ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన పోస్టర్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులతో కలసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ యోజన ఆరో వార్షికోత్సవం సందర్భంగా ఆయుష్మాన్ పఖ్వాడా వేడుకల్లో భాగంగా ఆయుష్మాన్ భారత్ వైద్య శిబిరం ఏర్పాటు చేసి, మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఆయుష్మాన్ భారత్ యోజనను ప్రవేశపెట్టి, ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా దేశ వ్యాప్తంగా ఆయుష్మాన్ పఖ్వాడాను నిర్వహిస్తున్నారని తెలిపారు. 70 ఏళ్లు పైబడిన అర్హులకు ఆయుష్మాన్ కార్డులను మంజూరు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి, డా.ఎన్టీఆర్ వైద్య సేవ కోఆర్డినేటర్ రాజశేఖర్, జిల్లా మేనేజర్ శివకుమార్, డీసీహెచ్ఎస్ ఆనందమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పద్మావతి కళాశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ నారాయణమ్మ

తిరుపతి సిటీ: ఎస్వీ మ్యూజిక్ కళాశాల వేదికగా జరిగిన జిల్లాస్థాయి యువజన సాంస్కృతిక ఉత్సవాల పోటీల్లో పద్మావతి డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను దక్కించుకున్నారని ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణమ్మ తెలిపారు. అలాగే ఎస్వీయూ 70వ వార్షికోత్సవం సందర్భంగా డైరెక్టరేట్ స్టూడెంట్స్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీల్లో ఎస్పీడబ్ల్యూ విద్యార్థినులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందడం కళాశాలకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో కళాశాల సాంస్కృతిక కమిటీ కన్వీనర్ నాగపద్మ, లక్ష్మీసంధ్య, హేమలత, శ్యామల, పద్మజ పాల్గొన్నారు.

స్పెషల్ సమ్మరీ రివిజన్‌కు సహకరించండి



రాజకీయ పార్టీల నేతలతో మాట్లాడుతున్న మౌర్య

తిరుపతి తుడా: ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025కు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని తిరుపతి నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి మౌర్య కోరారు. స్పెషల్ సమ్మరీ రివిజన్–2025పై వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులతో సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆగస్టు 20 నుంచి సెప్టెంబర్ 20వ తేదీ వరకు స్పెషల్ సమ్మరీ రివిజన్–2025 ఇంటింటి సర్వేలో వచ్చిన ఫారం వివరాలను పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఆమె మాట్లాడుతూ 1500 ఓటర్లు దాటిన ఏడు పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, ఈ నివేదికను జిల్లా ఎన్నికల అధికారికి సమర్పిస్తామని తెలిపారు. సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్‌తేజ్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, తహసీల్దార్ భాగ్యలక్ష్మి, డీటీ జీవన్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించండి

తిరుపతి(అలిపిరి): టీటీడీ ఉద్యోగులకు వడమాలపేట మండలం పాదిరేడులో కేటాయించిన ఇళ్ల స్థలాల అభివృద్ధి పనులతో పాటు ఉద్యోగులకు స్థానికంగా సమస్యలు లేకుండా పరిష్కరించాలని టీటీడీ ఎంప్లాయీస్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు, సభ్యులతో పాటు పలు ఉద్యోగ సంఘాల సభ్యులు కోరారు. సోమవారం పలు సమస్యలపై టీటీడీ ఈఓ శ్యామలరావును కలిసి పలు సమస్యలను విన్నవించారు. పాదిరేడులో తొలగించిన హద్దు రాళ్లను పునరుద్ధరించాలని.. రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నందున సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఈఓ సూచనల మేరకు టీటీడీ వెల్ఫేర్ ఆఫీసర్ ఆనంద్‌రాజ్, ఎస్టేట్ ఆఫీసర్ గుణభూషణరెడ్డి, నరసింహమూర్తితో కలిసి టీటీడీ ఎంప్లాయీస్ హౌసింగ్ సొసైటీ, ఉద్యోగ సంఘాలు పాదిరేడుకు చేరుకుని లేఅవుట్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో టీటీడీ ఎంప్లాయీస్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు జి.వెంకటరమణారెడ్డి, కార్యదర్శి గోల్కొండ వెంకటేశం, కోశాధికారి ప్రసాదరావు, డైరెక్టర్లు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మానవ నిబద్ధతకు మార్గదర్శకం బౌద్ధం



అంబేడ్కర్ దమ్మ యాత్ర ర్యాలీ దృశ్యాలు

తిరుపతి కల్చరల్: మానవ నిబద్ధత, నీతివంతమైన జీవనానికి మార్గదర్శకం బౌద్ధమని, బౌద్ధధర్మం పాటించడంతో మానసిక పరమైన ముక్తి పొందవచ్చని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. అశోక విజయదశమిని పురస్కరించుకుని బౌద్ధ సన్యాసులు, బుద్ధిస్టులు కేరళ తిరువనంతపురం నుంచి నాగపూర్‌లోని బుద్ధభూమి ప్రారంభించిన అశోక్–అంబేడ్కర్ దమ్మ యాత్ర సోమవారం తిరుపతికి చేరుకుంది. ఈ దమ్మ యాత్రకు ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం సర్కిల్లో బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, అంబేడ్కర్ భవన్ కమిటీ నేత పరమశివన్ ఆధ్వర్యంలో పలువురు దళిత సంఘాల నేతలు, ప్రజాసంఘాలు, బుద్ధిస్టులు ఘనస్వాగతం పలికారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు విచ్చేసి యాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు, బుద్ధిస్టులు పాల్గొన్నారు.

దేవుడే శిక్షిస్తాడు



మీడియాతో మాట్లాడుతున్న రాధా మనోహర్ దాస్

తిరుపతి(అలిపిరి): చిల్లర రాజకీయాలు చేస్తే దేవుడే శిక్షిస్తాడని బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ అన్నారు. పుంగనూరు నియోజకవర్గం నుంచి చేపట్టిన ఆయన పాదయాత్ర సోమవారం తిరుపతికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్యమతస్తులు తిరుమలకు రావాలంటే తప్పనిసరిగా శ్రీవారిని మనస్ఫూర్తిగా నమ్ముతున్నామని.. డిక్లరేషన్‌పై సంతకం చేయాల్సి ఉంటుందన్నారు. అనంతరం అలిపిరి వద్ద స్థానిక ఇస్కాన్‌కు చెందిన స్వామిదాసులు మద్దతు తెలిపారు. రాధామనోహర్‌దాస్ మాట్లాడుతూ ఆలయాల్లో హిందువులు మాత్రమే పని చేయాలని.. తిరుమల మాదిరిగానే ఇతర ఆలయాలను రక్షించాలని కోరారు.

భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక కమిటీ



మాట్లాడుతున్న అడిషనల్ ఈఓ వెంకయ్య చౌదరి

తిరుమల: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలలో అక్టోబరు 8న గరుడ సేవను తిలకించడానికి విచ్చేసే అసంఖ్యాక యాత్రికులను వాహనానంతరం సురక్షితంగా తరలించడంలో భాగంగా టీటీడీ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఇదే విషయాన్ని సోమవారం సాయంత్రం తిరుమలలోని అన్నమయ్య భవనంలో బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరి సమీక్షించారు. భక్తులకు తాము ఉన్న గ్యాలరీలకు దగ్గరగా ఉన్న బస్టాండు ప్రదేశాలకు చేరేందుకు వీలుగా డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయన ఇంజినీరింగ్ అధికారులను సూచించారు. సమావేశంలో, సీఈ సత్యనారాయణ, జీఎం ట్రాన్స్‌పోర్ట్ శేషారెడ్డి, డిప్యూటీ ఈఓ లోకనాథం, వీజీఓలు సురేంద్ర, రామ్‌కుమార్, గోశాల డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ హరనాథ్ రెడ్డి, ఆల్ హిందూ ధర్మ ప్రాజెక్ట్స్ అధికారులు పాల్గొన్నారు.

శ్రీరామలో ఇంటర్నల్ హాకథాన్–2024

తిరుపతి సిటీ: కరకంబాడిరోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం ఇంటర్నల్ హాక్తాన్–2024 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాలకు చెందిన విద్యార్థులు వివిధ అంశాల మీద స్వతహాగా చేసిన పరిశోధనలు ప్రదర్శించారు. కళాశాల డైరెక్టర్ మన్నెం అరవిందకుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలోని నైపుణ్యాన్ని, సృజనాత్మకతను వెలికితీసి సమాజానికి ఉపయోగపడే విధంగా కొత్త విషయాలను కనుగొనడమే ఇంటర్నల్ హాక్తాన్ ప్రధాన ఉద్దేశం అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ జయచంద్ర, కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, కన్వీనర్ డాక్టర్ వాసు, కోఆర్డినేటర్ కుమారి జమీల, విద్యార్థులు పాల్గొన్నారు.

మేనేజ్‌మెంట్ స్కిల్స్‌పై పట్టు సాధించాలి



ముఖ్యఅతిథిని సన్మానిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

తిరుపతి సిటీ: విద్యార్థులు మేనేజ్‌మెంట్ స్కిల్స్‌పై పట్టు సాధించాలని భవిష్యత్‌లో ఇది ప్రధాన భూమిక పోషిస్తుందని డిక్సన్ టెక్నాలజీస్ ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్ లక్ష్మీపతి కరణం నటరాజన్ తెలిపారు. సోమవారం స్థానిక కరంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏలో చేరిన నూతన విద్యార్థుల కోసం ఏర్పాటు చేసి ఓరియెంటేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి ఎస్వీసీఈ ఎంతోమంది విద్యార్థులను పలు ప్రముఖ కంపెనీలకు మేనేజర్లుగా తయారు చేసిందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ తారకేశ్వర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్‌కుమార్‌కు డాక్టరేట్



తిరుపతి సిటీ: ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఈసీఈ విభాగపు పరిశోధక విద్యార్థి రాజ్‌కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆయన ప్రొఫెసర్ ఉమా మహేశ్వరరెడ్డి పర్యవేక్షణలో డిజైన్ అండ్ మోడలింగ్ ఫర్ హైస్పీడ్ వీఎల్ఎస్ఐ సర్క్యూట్ యూజింగ్ త్రూ సిలికాన్ వయాస్ అనే అంశంపై పరిశోధన పత్రాలు సమర్పించారు.

మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం

తిరుపతి సిటీ: జబర్దస్త్ నటుడు ఆర్పీ అనే వ్యక్తి మహిళలను గురించి అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని, ఇలాంటివి పునరావృతం అయితే ఊరుకునేది లేదని ఖబడ్దార్ ఆర్పీ అంటూ రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ (ఆర్‌సీడీఎస్) అధ్యక్షుడు యారపురెడ్డి సురేంద్రరెడ్డి హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీకి చెందిన సెలబ్రిటీలు, మహిళలపై వెటకారపు మాటలతో అహంకారపు మాటలు మాట్లాడడం తగదన్నారు. వెంటనే పోలీసులు, అధికారులు అతనిపై చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలకు రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ అండగా ఉంటుందని తెలిపారు. సమావేశంలో సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మహిళా అధ్యక్షురాలు శ్రీలత రెడ్డి, రాష్ట్ర కోశాధికారి శివనాగి రెడ్డి, నేషనల్ కన్వీనర్ వలపురెడ్డి వెంగళ్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలు రమాదేవి పాల్గొన్నారు.

దుర్గేష్ సేవలు మరువలేనివి



దుర్గేష్‌ను సత్కరిస్తున్న చీఫ్ కమిషనర్ సురేష్

తిరుపతి రూరల్: సమర్థవంతంగా విధి నిర్వహణలో మేటి దుర్గేష్‌సామ్రాట్ అని ఆదాయపు పన్నుశాఖ చీఫ్ కమిషనర్ బత్తిన సురేష్ కొనియాడారు. తిరుపతి ఆదాయపు పన్నుశాఖ ప్రిన్సిపల్ కమిషనర్ దుర్గేష్‌సామ్రాట్ పదవీ విరమణ సభ సోమవారం సాయంత్రం తిరుపతిలోని ఓ ప్రైవేటు హోటల్లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన దుర్గేష్‌సామ్రాట్ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆదాయపు పన్ను శాఖాధికారులు అనిల్‌కుమార్, పీరా, సిబ్బంది పాల్గొన్నారు.

12వ పీఆర్సీ కమిటీని వెంటనే నియమించాలి



మాట్లాడుతున్న జయరాంనాయుడు

పాకాల: రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీ కమిటీని వెంటనే నియమించి, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరాం నాయుడు కోరారు. సోమవారం స్థానిక పెన్షనర్ల కార్యాలయంలో పాకాల యూనిట్ అధ్యక్షుడు పీఆర్ మునస్వామి అధ్యక్షతన పెన్షనర్ల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జయరాం నాయుడు మాట్లాడుతూ డీఆర్ బకాయిలన్నీ కలిపి ఒకే వాయిదాలో చెల్లించాలని, అదనపు పెన్షన్ ఏక్యూ 10 శాతం, 15 శాతంగా పునరుద్ధించాలని కోరారు. అలాగే 70 సంవత్సరాలు నిండిన సర్వీస్ పెన్షనర్లు అందరూ రూ.500 చెల్లించి సంఘంలో తిరిగి చేరాలన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.కుప్పుస్వామి నాయుడు, కోశాధికారి కె.రామమూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు జి.ఆంజనేయులు, మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, మునస్వామి, మునిరత్నంరెడ్డి, కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు.

విజేతలకు నగదు బహుమతి



లక్కీ డ్రా తీస్తున్న కలెక్టర్

తిరుపతి తుడా: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది 27 జూన్ నుంచి 24 జూలై వరకు జరిగిన మాసోత్సవాల సందర్భంగా కుటుంబ నియంత్రణ తాత్కాలిక పద్ధతులు పాటించిన దంపతులకు ఆరోగ్యశాఖ బహుమతులను ప్రకటించింది. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శ్రీహరి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ లక్కీ డిప్ ద్వారా కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించిన దంపతుల్లో ఇద్దరిని డ్రాలో ఎంపిక చేశారు. కుటుంబ నియంత్రణ పాటించిన 1,739 మందిలో వెంకటగిరి డక్కిలి మండలం లింగసముద్రానికి చెందిన సుమతి లక్కీడిప్‌లో రూ.5 వేలు నగదు బహుమతికి ఎంపికయ్యారు. అలాగే 486 మందిలో శ్రీకాళహస్తికి చెందిన సాయమ్మ రూ.5 వేలు నగదు బహుమతికి లక్కీ డిప్ ద్వారా ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ ఏఈఓ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, మాస్ మీడియా అధికారి బాబు నెహ్రూరెడ్డి, ఎపిడిమాలజిస్ట్ లావణ్య, జిల్లా గణాంక అధికారి నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు.

ప్రజలు సంతృప్తి పడేలా ఫిర్యాదుల పరిష్కారం



వినతులను స్వీకరిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా: ప్రజలు సంతృప్తి పడేలా ఫిర్యాదులను పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో 47 వినతులు వచ్చాయి. తమ వీధిలో చెట్ల కొమ్మలు ఎక్కువగా ఉండడంతో ఇబ్బంది పడుతున్నామని, వాటిని తొలగించాలని, తాగునీరు నిర్దిష్ట సమయంలో సరఫరా చేయాలని, మురుగు కాలువలు శుభ్రం చేయాలని, టీడీఆర్ బాండ్లు ఇప్పించాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, పలువురు కమిషనర్‌కు విన్నవించారు. అనంతరం ఫిర్యాదులను ఆయా విభాగాల అధికారులకు పంపి వాటిని పరిష్కరించి ఫిర్యాదుదారులకు తెలియజేయాలని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, ఇంజినీర్లు తులసికుమార్, గోమతి, సెక్రటరీ రాధిక, ఏసీపీ బాలాజీ, రమణ, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, మేనేజర్ హాసీమ్, అకౌంటెంట్ రమేష్, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

తిరుపతి కల్చరల్: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించడంతో పాటు అన్ని రంగాల్లో రాణించి మంచి పౌరులుగా ఎదగాలని ఉప విద్యాశాఖాధికారి కే.బాలాజీ పిలుపునిచ్చారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని మబ్బు సూర్యనారాయణరెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ జేఎస్ఎం స్కూల్లో సోమవారం వ్యాసరచన, వక్తృత్వ, దేశభక్తి గీతాలు, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ జయంతిని పురస్కరించుకుని చారిటబుల్ ట్రస్ట్ వారు వివిధ సృజనాత్మక పోటీల్లో విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మబ్బు సూర్యనారాయణరెడ్డి, కో–ఆర్డినేటర్ రేవంత్, ఎంఈఓ బి.భాస్కర్ నాయక్, హెచ్ఎం మునిశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దళిత వర్కర్లపై వివక్ష దుర్మార్గం



మాట్లాడుతున్న ఆర్పీఐ దక్షిణ భారత అధ్యక్షుడు అంజయ్య

తిరుపతి కల్చరల్: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుపతి ధార్మిక క్షేత్రంలో అడుగడుగునా ఎస్సీ, ఎస్టీ వర్కర్లపై అధికారులు వివక్ష చూపుతూ హేళన చేస్తూ వారిని మానసిక క్షోభకు గురి చేస్తున్నారని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణ భారత అధ్యక్షుడు అంజయ్య ధ్వజమెత్తారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల హెల్త్ డెప్యూటీ ఈఓగా బాధ్యతలు చేపట్టిన ఆశాజ్యోతి గత రెండు నెలలుగా హెల్త్ విభాగంలో నిరంతరం శ్రమిస్తున్న ఎస్సీ, ఎస్టీ వర్కర్లను అవమానించడం నిత్యకృత్యంగా మారిందన్నారు. దీనికి తోడు హెల్త్ ఆఫీసర్ మధుసూదన్ సైతం ఇదే ధోరణితో వ్యవహరిస్తూ వర్కర్లను హీనంగా మాట్లాడుతూ ఆందోళనకు గురి చేయడం దుర్మార్గమన్నారు. టీటీడీలో గత ఆరేళ్లుగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ నిలిపివేసి అధికారులు బాధ్యతారహితంగా వ్యవహరించారని విమర్శించారు. సమావేశంలో గోవిందయ్య, డీఎంసీ భాస్కర్, బాబు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

తిరుమల : తిరుమలలో పనిచేస్తున్న టీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ సిబ్బంది, ఆలయ సిబ్బందికి కార్డియో పల్మనరీ రెసిస్టెన్స్(సీపీఆర్)పై వైద్యులు శిక్షణ అందించారు. స్థానిక అశ్విని ఆస్పత్రిలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కుసుమకుమారి ఆధ్వర్యంలో రెండు రోజుల ఈ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో టీటీడీ స్విమ్స్ ఆస్పత్రి సీపీఆర్ బృందం, అశ్విని ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో తిరుపతి క్రీడాకారుడి ప్రతిభ



బంగారు పతకంతో పవన్‌కుమార్

తిరుపతి ఎడ్యుకేషన్ : తైక్వాండో పోటీల్లో తిరుపతికి చెందిన క్రీడాకారుడు ప్రతిభ కనబరిచి, పసిడి పతకం కైవసం చేసుకున్నాడు. ఈ నెల 28, 29వ తేదీల్లో గోవా విఫా జీ విన్ ఇండియా ఓపెన్ ఇంటర్నేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 5 దేశాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. తిరుపతికి చెందిన క్రీడాకారుడు కనిశెట్టి పవన్‌కుమార్ 75 కిలోల క్యైరోజీ (ఫైటింగ్) విభాగంలో బ్లాక్ బెల్ట్ సీనియర్ కేటగిరిలో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. అంతర్జాతీయ తైక్వాండో పోటీల్లో బంగారు పతకాన్ని సాధించిన అతన్ని తిరుపతికి చెందిన క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు అభినందించారు.

ఆకట్టుకున్న భరత్ శర్మ ప్రవచనాలు



ప్రవచనం చేస్తున్న శతావధాని భరత్ శర్మ

తిరుపతి కల్చరల్: అన్నమాచార్య కళామందిరంలో సోమవారం రాత్రి శతావధాని ఉప్పలధడియం భరత్ శర్మ నిర్వహించిన వామనవతార వైభవం ప్రవచనం భక్తులకు ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ప్రవచన కర్త వామనవతారం వైభవంతో పాటు బలి చక్రవర్తి వృత్తాంతం, శ్రీమహావిష్ణువు లీలల ఆంతర్యం గురించి వివరించారు. ప్రవచన కర్తను అన్నమాచార్య ప్రాజెక్టు కోఆర్డినేటర్ కోకిల, రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి, చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రం వ్యవస్థాపకుడు హనుమంతరావు ఘనంగా సత్కరించారు.

ఫుట్‌బాల్ పోటీల్లో భాకరాపేట విద్యార్థుల ప్రతిభ



ఫుట్‌బాల్ పోటీల్లో విజేతలైన భాకరాపేట విద్యార్థులు

భాకరాపేట : రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో భాకరాపేట గీతాంజలి స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సోమవారం గీతాంజలి స్కూల్‌లో కరస్పాండెంట్ గిరికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఈ నెల 29వ తేదీన కర్నూలులో జరిగిన ఫుట్‌బాల్ పోటీల్లో తిరుపతి జిల్లా తరుపున తలపడ్డారు. ఉత్తమ ప్రతిభను కనపరిచి రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలిచారు. ఈ విజయానికి కారణమైన వ్యాయామ ఉపాధ్యాయుడు కృష్ణమూర్తిని అభినందించారు.